# సంసారము

## ౧

కాపరానికి వచ్చిన క్రొత్తలో.

'ఇదిగో తాంబూళం'

'.....................'

'నింపాదిగా వేసుకు వెళ్ళుదురూ'

'పదిమ్ముప్పావు అయింది, కమలా!'

'ఒక్క అయిదునిముషాలు వుందురూ'

భార్య అందించుచుండగా గిరి ఒకటి తరువాత ఒకటి నమలుచూ 'అప్పుడే నెల రోజు లైంది. నిన్నవచ్చినట్లు వుందికదూ?'

'అవును. నిముషాలలాగ వెళ్ళిపోతున్నాయి రోజులు. ఆఫీసే లేకపోతే ఎలాగ వుండునో?'

'సాయింత్రము నేను వచ్చేదాక మా చెడ్డ కష్టంగావుంటుందనుకొంటాను నీకు.'

'అసలు వస్తారా అనిపిస్తుంది—లేచారేమిటి?. అయిదునిముషాలు అయిపోయాయా? ఉండండి. ఫ్లాస్కులో యింకా కాస్త కాఫీ పోసియిస్తాను.'

'చాల్లెద్దూ. వేళయిందిమరి.'

'టిఫిన్ కారియరు సైకిలుకు కట్టినాను. ఏకత్రొంద రయిపోయింది. బాగుంటుందో లేదో?'

'బాగుండక పోవటము కూడానా?'

'ఒక్కక్షణము వుండండి. నేనుకూడా గేటువరకూ వస్తాను.'

'రా, మరి.'

గేటుదగ్గిర సైకిలుఎక్కిపోవుచూ మాటిమాటికి వెనుకకుతిరిగి చెయ్యి ఆడించుచూ మలుపుతిరిగి వెళ్ళిపోయెను. కమల ఆతడు అదృశ్యుడగువరకూ చూచుచూ, కన్నులలో నిలచిన రెండు అశ్రుబిందువులను పమిటతో తుడిచికొని సూర్యాస్తమయమునకై వేచియుండెను.

## ౨

పిల్లలు పుట్టిన తరవాత

'మ్,... ...ఇదిగో...ఓసేయి...మాట.'

'ఎందుకండీ!'

'పదిమ్ముప్పావు అయింది తెలుసునా?'

'అయితే'

'పంచ ఏదీ'

'అదేం. ఎదురుగుండా పెట్టుకొని'

'ఇది కట్టుకుపోనా?'

'దాని కేమండీ?'

'మొఖంతుడుచుకోటానికి ముక్కుతూడుచుకోటానికి నాపంచలే కావాలి కాబోలు అందఱికి?'

'ఇప్పు డెవరు ముట్టుకున్నారు ఈపంచ?'

'యిదేమిటిది?'

'కిష్టడు జిడ్డుచెయ్యి దీనికి తుడిచాడు కాబోలు!'

'యింకొకటి తెచ్చిపెట్టటము వుందా? లేదా?'

'కాస్త చూసుకొందురూ, చిట్టిని అన్నానికి కూర్చోపెట్టి వచ్చాను. విస్తరిలో కాలు పెట్టుతుంది.'

'ఆఫీసుకువెళ్ళేటప్పుడే వస్తాయి అన్ని పనులూ నీకు.'

'యిప్పుడేమిచెయ్యాలేమిటి నేను?'

'పెట్టెతీసి పంచతీసి యివ్వాలి.'

'అంటుచెయ్యి. కొత్త పెట్టెమూతతీసి తీసుకోలేరు'

గిరి పెట్టెతెరచెను. అందు చీరలు, జాకెట్లు, పిల్లల చొక్కాలు, అక్కడక్కడ తన పాతకోట్లు కనిపించెను.

'అలా కలిపెయ్యకండి. పంచ లేదు కాబోలు.'

చటాలున లేచి గిరి భార్యబుగ్గ పట్టుకొనెను.

'వూరుకోండురూ. ఏదో ఒకదానికి ఎప్పుడూ కోపమే.'

గిరి కోటుతొడుగుకొంటూ 'ఎలాగవుందో యిల్లు. సాయంత్రానికి సర్ది వుంచు.'

'అలాగే లెండి.తలుపు వేసుకు వెళ్ళండి.'

...తలుపుదభాలునమూసిన చప్పుడయ్యెను.

౩

ముసలితనములో

'ఏమేవు - నీకు జ్ఞాపకమువుందా మన పెళ్ళి?'

'సరిసరి. అది జ్ఞాపకమువుండక పోవాలీ. రేపటికి సరిగ్గా 50 ఏండ్లవుతుంది.'

'అప్పుడెలాగవుండేదాన వనుకొన్నావు?'

'ఎలాగవుండేదాన్ని ?' అని దగ్గరకు జరుగును.

'చక్కెరబొమ్మ. సుఖమంటే అదీ సుఖము. ఒకరోజైనా పోట్లాడుకొన్నామా ?'

'చలిగాలి వేస్తూంది. పైబొత్తాముకూడా పెట్టుకోండి' గిరి గుండీపెట్టుకొనబోగా వ్రేళ్ళు వణకును. భార్య పెట్టును.

'యాభై ఏళ్ళు - యాభైనిముషాలుకదా. ఒకరోజైనా ఎందుకొచ్చిన పెళ్ళామురా అని అనుకోలేదు.'

'ఆ ఎర్రఫ్లేనలు గుడ్డ ఏదీ- దానిమీద కూర్చున్నారా. చెవులకు చలిగాలి తగులుతుంది'

కమల ఫ్లేనలుగుడ్డ తలకు కట్టెను. గిరి ఆమెచేతులను తడుముచూ, మెల్లిగా, గొణుగుచూ, 'యాభై ఏళ్ళు -ఒకటికాదు. రెండుకాదు. యాభై ఏళ్ళు. ఒకనాడైనా విచారించ లేదు కదా.'

'జాగ్రత్తనుమండీ. వెలుతురువుండగానే తిరిగిరండి పశువులువచ్చే సమయము కూడాను. బంగాళాదగ్గిర రోడ్డు బాగుచేస్తున్నారు. రాళ్ళు అవి వుంటాయి. చూసుకొంటూ వెళ్లండి... (గేటుదగ్గిర) మీరు వచ్చేదాక యిక్కడే వుంటాను.'

—ఇరువంటి విష్ణురావు, బి.ఏ.,బి.ఎల్.



మ. "పటసమ్మార్జనగీత...ప్రహ్లోనశబ్దంబు లొక్కట నోరన్వెడలంగ బట్టలుతుకన్..."